### భగవంతుడి ఆశీస్సులతో..

## కేసీఆర్ త్వరగా కోలుకోవాలి: నామా



ఖమ్మం, డిసెంబర్ 8: ఇంట్లో ప్రమాదవశాత్తు గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ త్వరగా కోలుకోవాలని పార్టీ లోక్‌సభా పక్ష నేత, ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు ఆకాంక్షించారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. భగవంతుడి ఆశీస్సులతో ఆయన త్వరగా కోలుకుని ప్రజాక్షేత్రంలోకి వచ్చి ప్రజలకు సేవలందిస్తారని ఆకాంక్షిస్తున్నట్లు చెప్పారు. అద్భుత పాలనతో కేసీఆర్ ఎల్లప్పుడూ ప్రజల హృదయాల్లో ఉంటారని అన్నారు. ప్రజల ఆశీస్సులు ఆయనకు ఎల్లవేళలా ఉంటాయని ఉద్ఘాటించారు.

## కేసీఆర్ త్వరగా కోలుకోవాలంటూ నమాజు



మసీదులో ప్రత్యేక నమాజు చేస్తున్న ముస్లింలు

రామవరం, డిసెంబర్ 8: బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అల్లాహ్ దయతో విజయవంతంగా శస్త్రచికిత్స పూర్తిచేసుకుని తిరిగి కోలుకోవాలని సింగరేణి కొత్తగూడెం ఏరియా పరిధిలోని రుద్రంపూర్ మజీద్– ఏ– ఖ్యాబాలో శుక్రవారం స్థానిక ముస్లింలు ప్రత్యేక నమాజులు ఆచరించారు. మసీద్ అధ్యక్షుడు అజీజ్‌ఖాన్, టీబీజీకేఎస్ ఏరియా వైస్ ప్రెసిడెంట్ ఎండీ రజాక్, నాయకులు సోనూ సాబ్, అజారుద్దీన్, ఉమర్, షమీం, మునావర్, అఫ్జల్, రబ్బాని తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఎస్‌బీఐటీలో ఎంఎన్‌సీలతో శిక్షణ: ఆర్‌జేసీ కృష్ణ



మాట్లాడుతున్న కళాశాల చైర్మన్ ఆర్‌జేసీ కృష్ణ

ఖమ్మం ఎడ్యుకేషన్, డిసెంబర్ 8: సాఫ్ట్‌వేర్ రంగంలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన మల్టీనేషనల్ కంపెనీలతో నగరంలోని తమ కళాశాలలో ఇంజినీరింగ్ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు శనివారం శిక్షణ కల్పించనున్నట్లు ఎస్‌బీఐటీ కళాశాల చైర్మన్ గుండాల (ఆర్‌జేసీ) కృష్ణ తెలిపారు. కళాశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జాతీయస్థాయిలో శిక్షణ కల్పించే ఐటీసీ అకాడమీ ఆధ్వర్యంలో హెచ్‌సీఎల్ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ శివప్రసాద్, సర్వీస్‌నౌ డైరెక్టర్ భాస్కర్, టీసీఎస్ రీజియన్ హెడ్ రిచర్డ్‌కింగ్, బిర్లాసాఫ్ట్ ఐటీ హెడ్ అబువ్ బెకర్‌లు హాజరుకానున్నట్లు వివరించారు. కళాశాల సెక్రటరీ ధాత్రి, ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్, అకడమిక్ డైరెక్టర్ ప్రవీణ్, ఐటీసీ రీజినల్ రిలేషన్‌షిప్ మేనేజర్ గౌస్‌పాషా పాల్గొన్నారు.

## భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా కార్యవర్గం ఎన్నిక



కొత్తగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

కొత్తగూడెం ఎడ్యుకేషన్, డిసెంబర్ 8: భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా కార్యవర్గాన్ని డీఈవో వెంకటేశ్వరచారి (స్కౌట్స్ జిల్లా చీఫ్ కమిషనర్) సమక్షంలో శుక్రవారం ఎన్నుకున్నారు. జిల్లా సెక్రటరీగా ముత్తబోయిన శ్రీనివాసరావు, జాయింట్ సెక్రటరీగా భారతమాత, వరలక్ష్మి, ఆనంద్‌కుమార్, మాధవరావు, చలపతి, లక్ష్మీరెడ్డి, పీవీ రమణ, రాగేంద్ర, సమ్మయ్య, కొడాలి జగదీశ్వర్‌రావు, అమృతలను ఎన్నుకున్నారు.

## ‘విద్యార్థుల కనీస సామర్థ్యాల సాధనకు కృషి చేయాలి’

పాల్వంచ, డిసెంబర్ 8 : ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లో కనీస సామర్థ్యాల పెంపు కోసం ఉపాధ్యాయులు కృషి చేయాలని ఉన్నతి కో ఆర్డినేటర్ శ్రీనివాసరావు సూచించారు. పాల్వంచ, ములకలపల్లి, లక్ష్మీదేవిపల్లి మండలాల సబ్జెక్టు టీచర్లకు బొల్లోరిగూడెం పాఠశాలల్లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చినందున దానిని అనుసరించి ఆయా సబ్జెక్టుల్లో విద్యార్థులు పట్టు సాధించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లా సైన్స్ ఆఫీసర్ చలపతిరాజు, ఎంఈవో శ్రీరామ్మూర్తి, హెచ్‌ఎం పద్మలత తదితరులు పాల్గొన్నారు.

## రగ్బీ పోటీలకు గురుకుల పాఠశాల విద్యార్థుల ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో గురుకుల టీచర్లు

ఖమ్మం సిటీ, డిసెంబర్ 8: రగ్బీ పోటీలకు జిల్లాలోని గురుకుల పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఖమ్మం పటేల్ స్టేడియంలో డీఈవో సోమశేఖరశర్మ పర్యవేక్షణలో అండర్–14 ఉమ్మడి జిల్లా పాఠశాల రగ్బీ పోటీల ఎంపిక ప్రకియ జరగింది. ఈ ఎంపికలో వైరా మహాత్మా జ్యోతీరావుపూలే గురుకుల పాఠశాల (బాలురు) విద్యార్థులు వీ.ప్రశాంత్, బీ.మోహన్, కృష్ణలు అత్యుత్తమ ప్రతిభ కనబర్చారు. వీరు ఈ నెల11, 12, 13 తేదీల్లో రంగారెడ్డి జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు ఆడనున్నారు. ఎంపికైన విద్యార్థులను ఆర్‌సీవో అంజలి, ప్రిన్సిపాల్ మల్లయ్య అభినందించారు.

# ‘యూ డైస్’ను పూర్తి చేయాలి

- వివరాలను ఏకీకృత జిల్లా సమాచార వ్యవస్థలో నమోదు చేయాలి
- డాటా క్యాప్చర్ ఫార్మేట్‌పై అవగాహన ఉండాలి: ఖమ్మం కలెక్టర్



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్

మామిళ్లగూడెం, డిసెంబర్ 8: విద్య కోసం ఏకీకృత జిల్లా సమాచార వ్యవస్థలో డాటాను పూరించే ప్రక్రియను వెంటనే చేపట్టాలని ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్ సూచించారు. ఏకీకృత సమాచార వ్యవస్థ (యూనిఫైడ్ డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్ సిస్టం ఫర్ ఎడ్యుకేషన్) డాటా నమోదుపై జిల్లా అధికారులు, ప్రిన్సిపాళ్లు, మండల విద్యాధికారులతో కలెక్టరేట్‌లో శుక్రవారం నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. పాఠశాలల స్థితిగతులు, విద్యార్థులు, ఉపాధ్యాయుల సమాచారంపై ఏటా ఏకీకృత జిల్లా సమాచార వ్యవస్థలో సమాచారం నమోదు చేసేందుకు ప్రధానోపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ డాటా నమోదుతో జిల్లాలోని విద్యా వ్యవస్థ పూర్తిగా తెలుస్తుందన్నారు. మౌలిక సదుపాయాల విషయంలో ఎన్ని పాఠశాలల్లో ఏ విధమైన సౌకర్యాలు ఉన్నాయో, ఇంకా ఏ సౌకర్యాలు చేయాల్సి ఉందో, ఎంతమంది విద్యార్థులు డ్రాప్ అవుట్ అయ్యారో అనే విషయాలు తెలుస్తాయని వివరించారు. ఈ సందర్భంగా యూ డైస్ డాటా క్యాప్చర్ ఫార్మేట్‌పై అధికారులు, ప్రిన్సిపాళ్లకు అవగాహన కల్పించారు. అదనపు కలెక్టర్ బీ.సత్యప్రసాద్, డీఈవో సోమశేఖరశర్మ, వివిధ శాఖల అధికారులు కే.సత్యనారాయణ, మహమూది, జ్యోతి, సుమ, విద్యాచందన, రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

**డెంగీ నియంత్రణకు పటిష్ఠ చర్యలు**

జిల్లాలో పరీక్షల సంఖ్యను పెంచి డెంగీ నియంత్రణకు పటిష్ఠ చర్యలు చేపట్టాలని కలెక్టర్ వీపీ గౌతమ్ అధికారులను ఆదేశించారు. డెంగీ నియంత్రణ చర్యలపై కలెక్టరేట్‌లో ఆయా శాఖల అధికారులతో శుక్రవారం నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఈ సంవత్సరం 1 జనవరి నుంచి ఇప్పటి వరకు 27,771 పరీక్షలు చేపట్టగా.. 505 డెంగీ పాజిటివ్ కేసులు నమోదైనట్లు తెలిపారు. గడిచిన మూడు వారాల్లో 62 పాజిటివ్ కేసులు నమోదు కాగా.. ఇందులో జిల్లాకు చెందిన వారు 40 మంది ఉండగా, ఇతర ప్రాంతాల వారు 22 మంది ఉన్నట్లు వివరించారు. పాజిటివ్ కేసులు నమోదైన ప్రాంతాల్లో పకడ్బందీగా డ్రై డే కార్యాచరణ చేపట్టాలని సూచించారు. అదనపు కలెక్టర్లు సత్యప్రసాద్, మధుసూదన్‌నాయక్, వివిధ శాఖల అధికారులు మాలతి, రాజేశ్వరరావు, వీవీ అప్పారావు, సోమశేఖరశర్మ, హరికిషన్, కే.సత్యనారాయణ, జ్యోతి, విజయలక్ష్మి, మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

**ఉపాధి హామీ పనుల్లో వేగం పెంచాలి**

ఉపాధి హామీ పథకంలో మంజూరైన అంగన్‌వాడీ టాయిలెట్ల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని, వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ వీపీ గౌతమ్ అధికారులను ఆదేశించారు. పనుల పురోగతిపై ఆయా మండలాల ఎంపీడీవోలతో కలెక్టరేట్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో 114 అంగన్‌వాడీ కేంద్రాల్లో టాయిలెట్ల నిర్మాణానికి రూ.46 లక్షలను మెటీరియల్ కాంపోనెంట్ కింద అడ్వాన్స్‌గా విడుదల చేసినట్లు తెలిపారు. డిసెంబర్ 15లోగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.

### సైనిక్ స్కూల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం: కలెక్టర్

కొత్తగూడెం ఎడ్యుకేషన్, డిసెంబర్ 8: 2024–25 విద్యా సంవత్సరంలో ఆలిండియా సైనిక్ స్కూల్లో ప్రవేశానికి విద్యార్థులు ఈ నెల 16లోగా దరఖాస్తు చేసుకోవాలని భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల శుక్రవారం ఒక ప్రకటనలో సూచించారు.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి: ఏసీ



పిచ్చి మొక్కలను తొలగిస్తున్న ఏసీ, అధికారులు, సిబ్బంది

మామిళ్లగూడెం, డిసెంబర్ 8: ప్రభుత్వ కార్యాలయాలను, వాటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని అదనపు కలెక్టర్ డీ.మధుసూదన్‌నాయక్ సూచించారు. డ్రై డే కార్యక్రమంలో భాగంగా నూతన కలెక్టరేట్ ఆవరణలో అధికారులు, సిబ్బంది కలిసి శుక్రవారం చేపట్టిన కార్యక్రమంలో ఆయన పాల్గొని వారితోపాటు పిచ్చి మొక్కలను తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మన ఇంటిని ఎలా పరిశుభ్రంగా ఉంచుకుంటామో.. మనం ఎక్కువ సమయం ఉండే కార్యాలయాన్ని కూడా అలాగే పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. వివిధ శాఖల అధికారులు మాలతి, అనసూయ, సంజయ్, సరిత, శ్రీనివాస్, అరుణ, మదన్‌గోపాల్, శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

**నెలాఖరులోగా సీఎంఆర్ పూర్తి చేయాలి: అదనపు కలెక్టర్**

ఖమ్మం, డిసెంబర్ 8: జిల్లాలోని రైస్‌మిల్లర్లు ఈ నెలాఖరులోగా సీఎంఆర్ పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ అధికారులను, రైస్‌మిల్లర్లను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో రైస్‌మిల్లర్లు, సివిల్ సప్లయి అధికారులతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2022–23 సంవత్సరంలో వానకాలంలో ఉన్న సీఎంఆర్‌ను ఈ నెల 31లోగా పూర్తి చేయాలని సూచించారు. ఎవరైతే సీఎంఆర్ ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తారో సంబంధిత రైస్‌మిల్లర్లను బ్లాక్ లిస్ట్‌లో పెట్టి భవిష్యత్‌లో ధాన్యం ఇవ్వకుండా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అధికారులు, మిల్లర్ల బాధ్యులు నర్సింహారావు, బొమ్మా రాజేశ్వరరావు, జువాజి నగేశ్ పాల్గొన్నారు.

### దివ్యాంగుల సాధికారత అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మం వ్యవసాయం/ కొత్తగూడెం టౌన్, డిసెంబర్ 8: అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా రాష్ట్రస్థాయిలో దివ్యాంగుల సాధికారత అవార్డులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఖమ్మం, భద్రాద్రి జిల్లాల సంక్షేమ అధికారులు సుమ, విజేత శుక్రవారం వేర్వేరు పత్రిక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన దివ్యాంగులు ఈ నెల 10లోపు wdsc.telangana.gov.in అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు భద్రాద్రి జిల్లాలో 833100 6010 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

### హజ్‌యాత్రకు దరఖాస్తులు..

రామవరం, డిసెంబర్ 8: 2024లో హజ్‌యాత్రకు వెళ్లాలనుకునే ముస్లింలు ఈ నెల 20లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనార్టీ అధ్యక్షుడు ఎండీ యాకూబ్‌పాషా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 70 ఏళ్లు పైబడిన వారిని నేరుగా హజ్‌యాత్రకు ఎంపిక చేస్తారని, మిగిలిన వారిని మాత్రం డ్రా ద్వారా ఎంపిక చేస్తారని అన్నారు. మరింత సమాచారం కోసం 852 0860785 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

## స్కాలర్‌షిప్ కోసం మైనార్టీ విద్యార్థుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

కొత్తగూడెం ఎడ్యుకేషన్, డిసెంబర్ 8: సౌదీ అరేబియాలోని కింగ్ అబుల్ అజీజ్ విశ్వవిద్యాలయం 2024 విద్యా సంవత్సరానికి గాను మైనార్టీ విద్యార్థులకు పూర్తి నిధులతో స్కాలర్‌షిప్ ఇవ్వనున్నందున అర్హులు ఈ నెల 18లోగా దరఖాస్తు చేసుకోవాలని మైనార్టీ వెల్ఫేర్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధికారి సంజీవరావు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. వివిధ విభాగాల్లో మాస్టర్, పీహెచ్‌డీ, డిగ్రీ ప్రోగ్రాం కోర్సులు కొనసాగించడానికి ఈ స్కాలర్‌షిప్‌లు విద్యార్థులకు ఉపయోగపడతాయని అన్నారు.

## విన్‌ఫీల్డ్‌కు ‘ఆలిండియా బెస్ట్ స్కూల్’ అవార్డు



అవార్డు అందుకుంటున్న విన్‌ఫీల్డ్ డైరెక్టర్లు

ఖమ్మం ఎడ్యుకేషన్, డిసెంబర్ 8: విద్యార్థిని విజేతగా మార్చడం, బడిని గుడిలా నిర్వహించడం, ప్రతి విద్యార్థినీ నైపుణ్యాలతో తీర్చిదిద్దడం, అందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడం వంటి అంశాల్లో ఉన్నతంగా నిలిచిన ఖమ్మంలోని విన్‌ఫీల్డ్ పాఠశాలకు ‘బెస్ట్ స్కూల్ విత్ హోలిస్టిక్ ఎడ్యుకేషన్’ అవార్డు లభించినట్లు పాఠశాల చైర్మన్ మన్నె కిశోర్‌కుమార్ శుక్రవారం తెలిపారు. టేలర్స్ యూనివర్సిటీ కౌలాలంపూర్‌లో మలేషియాలో గురువారం నిర్వహించిన వరల్డ్ స్కూల్ సమ్మిట్‌లో తాము ఈ బెస్ట్ స్కూల్ అవార్డును అందుకున్నట్లు చెప్పారు. కాగా, ఫౌండర్ రోబోచాంప్ ఆకాశ్ అహుజా నుంచి పాఠశాల డైరెక్టర్ గద్దె పుల్లారావు ఈ అవార్డును స్వీకరించారు. అలాగే, తమ పాఠశాలకు ఈ అవార్డు రావడం పట్ల తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సహకారం ఎంతో ఉందని డైరెక్టర్ పోలవరపు శ్రీకాంత్ పేర్కొన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616